

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - ఆరవ కథ -

ఆ రోజు సోమవారం.

"అమ్మా? ఏం చేస్తున్నావూ? " మా నాన్న నుండి ఫోన్.

"నానా, చెప్పు"

" మా గంగ ఫోన్ చేసింది. ఇవాళ వాళ్ళంతా నీదగ్గర కొస్తున్నారంట"

ఎవరో ఆవిడ?

"అదేనమ్మా, మన అంగలూరు నాయనమ్మ చెల్లెలి కూతురు. నాకు చెల్లెలవుతుంది. వాళ్ళమ్మాయీ, అల్లుడూ అమెరికాలో ఉంటారు. నిన్ను కలవడానికొస్తారివాళ"

"సరే .."

"ఎక్కువసేపు వెయిటింగ్ హాల్లో కూర్చోబెట్టకు , బాగోదు."

“కాఫీ, అదీ ఇచ్చి.....కాస్త నెమ్మదిగా మరి...”

“సరేలే నానా”

“స్టాఫ్ కు ముందే చెప్పు, ఫలానా వాళ్ళొస్తారనీ, కాస్త మర్యాదగా రిసీవ్ చేసుకోమనీ ...”

“అలాగే"

"మళ్ళానేమో....అదీ మరి.... జాగ్రత్త"

పాపం ఇంకేదో చెప్పాలనుకుంటున్నాడు గానీ, నేను గయ్యిమంటానని వెనకాడుతున్నట్టున్నాడు నాన్న.

"బాగానే చూసుకుంటాలే నానా. నువు కంగారు పడమాక"

రిసెప్షన్ లో చెప్పాను.

★★★★★★

ఉదయం పదకొండు దాటిన తర్వాత వచ్చారు గంగా భవానీ, ఆమె భర్తా.

“మన సత్యం కూతురండీ.” అని భర్తకు పరిచయం చేసింది నన్ను. తెల్లటి లాల్చీ, పైజమా.  జేబులో చేయి పెట్టుకుని, చాలా హుందాగా ఉన్నాడాయన. ఏవో ఫాక్టరీలు, బిజినెస్సులూ ఉన్నాయట. ఈ మధ్యన బిజినెస్ అదీ కొడుక్కి ఒప్పజెప్పి ఇంట్లో రెస్ట్ తీసుకుంటున్నాడట.

వాళ్ళిద్దర్నీ ఇదివరకెప్పుడూ చూసినట్టే లేదు.

“అన్నీ మా సత్యమన్నాయి పోలికలే. కాకపోతే ముక్కు తేడా.” అంది ఆవిడ నన్ను చూస్తూ. సన్నగా పొడుగ్గా ఉండి, వాలుజడ వేసుకుంది.  ముదురాకు పచ్చ వెంకట గిరి జరీ చీర కట్టుకుంది. మెడలో విలువైన వజ్రాల హారం మెరుస్తోంది.

“మీ ఫాదరూ, నేనూ చదువుకునే రోజుల్లో ఒకే బాచ్.  మీరు మెడిసిన్ చదివేప్పుడు ఓ సారి ఇంటిక్కూడా వచ్చాం. మీకు గుర్తుండి ఉండదు.” చెప్పాడాయన.

“సుభద్రా, వాళ్ళాయన  కూడా వచ్చార్రా” అంటూ నాతో చెప్పి,  లేచి డోర్ బయటకు తలపెట్టి “ స్వీటీ” అని పిలిచింది.

సుభద్ర అంటే వాళ్ళమ్మాయి అనుకుంటా .

“రోహనా, కం.” అంటూ రెండేళ్ళ పాపతో వచ్చింది . వయసు ముప్పై పైనే ఉంటాయేమో ఎత్తుగా, తెల్లగా, బొద్దుగా ఉంది. బిగుతైన చూడీదార్ వేసుకుని లోపలికి వచ్చింది.

“రోహా, సే గుడ్ మోణింగ్ టూ డాక్టరాంటీ.”  అని కూతురితో చెప్పి, “మికీ, షీ ఈజ్ .. “ ఫలానా అంటూ నన్ను భర్తకు పరిచయం చేసింది.

గొంతులో తెలుగు సరిగా పలకలేని  అతిశయం.

వచ్చిన అల్లుడు “ అయాం వేణూ మిక్కిలినేని..”   అని టెక్సాస్ లో ఏం చేస్తున్నాడోచెప్పి, చేతిలో ఉన్న కిన్లే బాటిల్ నా టేబిల్ మీద పెట్టి కూర్చున్నాడు.

పాత చుట్టరికాలు తిరగేశారు.

నా వివరాలు కొన్ని అడిగారు. పిల్లలెంతమంది, ఏం చదువుతున్నారూ లాంటివి.

"మీ తమ్ముడు ఎక్కడ ఉంటాడు.  ఏం చేస్తున్నాడు?"

"తమ్ముళ్ళెవరూ లేరండీ. ముగ్గురూ అన్నయ్యలే నాకు."

" సరే, అన్నయ్యలేం చేస్తున్నారు. వాళ్ళకు పిల్లలెంతమంది?"

ఇలాంటి వివరాలతో ఓ పావుగంట గడిచింది. ఆ టైములో పావుగంట అంటే,  బయట కూర్చున్నవాళ్ళకు ఓ పావుయుగంతో సమానం.

నన్ను ఏ రేంజ్ లో తిట్టుకుంటున్నారో...

ఇంతలో నర్సొచ్చి, ఫైళ్ళన్నీ వరసనే పేర్చి, వాళ్ళవంక చూసి, వెళ్ళబోతుంటే అందరికీ మజ్జిగ తెమ్మన్నాను.

సుభద్ర మజ్జిగ తాగుతూ " గాడ్, దిసీజ్ రీ..లీ ..... రీ..లీ.... గూడ్.  వెరీ టేస్టీ" అంటూ మొదటి సారి యూ ఎస్ వెళ్ళినపుడు తను సంగం మజ్జిగ ఎంత మిస్ అయిందో చెప్పింది.

“చూడు మా గుంటూరు బటర్ మిల్క్ ఎంత టేస్టీగా ఉంటాయో” అంటూ మొగుణ్ణి వెక్కిరించింది.

ఇంతకూ అతనెక్కడివాడో.

ఎక్కడివాడైతే నాకెందుకు.

త్వరగా ఓపీ చూసుకోవాలని లోపల్లోపల తొందరపడుతున్నాను.

" చెప్పండి మీ హెల్త్ అదీ బాగుంటోందా?" అని పెద్దావిడను అడిగాను, అలా అయినా విషయానికొస్తే బాగుండని.

"మమ్మీకి హెల్త్ అసలు బాగోవడం లేదాంటీ. ఫుడ్ సరిగా తీసుకోదు. నిద్రపోవడం లేదు. హెల్త్ పాడవుతుంది అని మేమెంత చెప్పినా వినదు. చాలా డిప్రెస్ అవుతాంది."

"ఏమైంది?" అడిగాను.

"ఏం లేదమ్మా. బాగానే ఉంటాంది. ఈళ్ళదంతా ఓ... హడావుడి." వచ్చినావిడ మొహమాటపడుతూ.

"ఉన్న సంగతి చెప్పు మమ్మీ." అని వాళ్ళమ్మతో చెప్పి "అదే ఆంటీ, చిన్నన్నకు మొన్న ఫెబ్ లో మేరేజ్ అయింది. వదిన ఇంతవరకూ కన్సీవ్ కాలేదు. ఓ సారి మీతో మాట్లాడదామని." సుభద్ర చెప్పింది.

"ఫిబ్రవరి అంటే ఎనిమిదినెలలేగా, తొందరేముంది?"

"తొందరగానే ఉందమ్మడూ. మనవళ్ళనెత్తుకోవాలనీ. స్వీటీ వాళ్ళ పిల్లలతో ఆడుకోవాలంటే, వీళ్ళేమో పోయి పోయి అమెరికాలో కూర్చున్నారు." అంటూ కూతుర్ని అల్లుణ్ణీ ఆక్షేపణగా చూసింది.

"మీరూ వచ్చి మాతో ఉండండాంటీ." టెక్సాస్ అల్లుడు నవ్వుతూ అన్నాడు.

"అబ్బాయి పెళ్ళిచేసుకుని ఎనిమిదినెలలయ్యింది. ఇంతవరకూ ఏ కబురూ లేదు. వాడికీ ఓ పిల్లో పిల్లాడో పుడితే హాయిగా రామా కృష్ణా అనుకుంటూ.."

ఆవిడ చీరా, నగలూ , వాలకం చూస్తే రామా కృష్ణా అనుకోవడానికి ఆస్కారమే లేదు. అని ఆశ్చర్యంగా చూస్తున్నాను.

"అది కాదాంటీ, మేరేజ్ అయిన తర్వాత ఇమ్మీడియట్ గా కన్సీవ్ అయ్యాను. వదిన కు డేట్స్ రెగ్యులర్ గా రావు. ఎప్పుడూ ప్రాబ్లమే తనకు. అదీ గాక స్టమక్ పెయిన్ వస్తుంటుంది. అలా స్టమక్ పెయిన్ వస్తే కన్సీవ్ కావడం కష్టమంట కదా."

" అండం విడుదల అయిన సూచనగా నొప్పి వస్తుంటుంది. అదేం పెద్ద ప్రాబ్లం కాదు. చాలా సహజం. అయినా ఓ సంవత్సరం పాటు వాళ్ళను తొందరపెట్టడం మంచిది కాదు."

"ప్రాబ్లెం ఏదైనా ఉంటే ముందే ట్రీట్మెంట్ తీసుకుంటే సరిపోతుంది కదాంటీ" అంటూ తన వాదన వినిపించింది.

" సరే ఓ సారి మీ అన్నా వదినలను పంపించండి. చూస్తాను." నా తొందర మాటల్లో వినిపించేలా చెప్పాను.

"అన్న పర్చేజింగ్ కోసమని ముంబై వెళ్ళాడాంటీ."

"సరే అతనొచ్చిన తర్వాత ఇద్దర్నీ కలిపి పంపండి" అన్నాను.

వదిన ఇక్కడే ఉంది. అంటూ నా రూం డోర్ తీసి "వదినా లోపలికి రా" అని పిలిచింది.

అంటే ఆ అమ్మాయి ఇప్పటివరకూ బయటే కూర్చుందా?

ఆ అమ్మాయి లోపలికొచ్చే లోపల పెద్దావిడ చెప్తోంది. " తండ్రి ఇల్లు పట్టించుకోడు. తల్లికి ఆరోగ్యం బాగోదు. మాకు సరిపోయే ఫామిలీ కాదు. అయినా సరే పిల్ల నచ్చి కావాలని చేసుకున్నాం. "

ఇరవై ఏళ్ళ బక్కపలుచని ఓ అమ్మాయి లోపలికొచ్చి ఇంటర్వ్యూ కు నిలబడినట్లు నిల్చుంది. నలుపులో కొద్దిగా మెరుగైన చాయ. ఇరవై ఏళ్ళని ఫైలు మీద వ్రాసి ఉంది కానీ, చూట్టానికి పదహారో, పద్దెనిమిదో అన్నట్లు బాగా సన్నగా ఉంది.

లేతాకుపచ్చ సిల్క్ చీరకట్టుకుంది. వంటి మీద ఏవేవో అర్థం పర్థం లేని నగలు.

నీడపట్టున ఉండే సౌకర్యాలు ఎరగని నల్లటి చేతులు. అర్ధచంద్రాకారంలో అరిగిపోయిన గోళ్ళు .

"ఆంటీ, షీ ఈజ్ సీత మా వదిన." అంది సుభద్ర.

ఆ అమ్మాయిని నా పక్కనే ఉన్న రౌండ్ స్టూల్ మీద కూర్చోమన్నాను.

“వదినా, మేడం మా ఆంటీనే. ఏం భయపడొద్దు.”

ముప్పై ఏళ్ళుండి, డెబ్బై కేజీలున్న సుభద్ర చూడీదార్ వేసుకుంటే, ఈ అమ్మాయికి ఆ చీరేవిటో నగలేవిటో, పెద్దింటి కోడలి వేషం గానీ 'వదినా' అన్న పిలుపు ఆ అమ్మాయికి అస్సలు నప్పలేదు.

“ఓ సారి ఎగ్జాం చెయ్యండాంటీ, యూటిరెస్ అది సరిగా ఉందో లేదో, ఓవరీస్ ఫంక్షనింగా కాదా. ఓవ్యులేషన్ జరుగుతోందో లేదో చూసుకోవాలని వదిన్ని ఎడ్యుకేట్ చేశాను. బేసల్ బడీ టెంపరేచర్ నోట్ చెయ్యి వదినా అని థర్మోమీటర్ కూడా ఇచ్చాను. పోయిన మంత్ చేశావా వదినా?” అని ఆ అమ్మాయినడిగింది.

ఈ సుభద్ర నుండి నుండి ఆ పిల్లను కాపాడాల్సిన బాధ్యత నాదేననిపించి, నర్స్ ను పిలిచి అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళమన్నాను.

డబ్బూ హోదా మర్చిపోయి ఈ అమ్మాయిని చేసుకున్నారంటే కొంచం విచిత్రంగా ఉంది.

ఆ అమ్మాయి లోపలికెళ్ళిపోయిన తర్వాత, సుభద్ర నా పక్కనే కూర్చుని చిన్నగా,

“ఆంటీ, మీ దగ్గర దాచేదేముంది. అన్నకు ముందో మాచ్ డివోర్స్ అయ్యింది. మమ్మీ డాడీ తనని ఎంత బాగా చూసుకునే వాళ్ళంటే, సొంత కూతురుని చూసుకున్నట్టు చూసుకునేవాళ్ళు. బట్ షి ఈజ్ టూ యారొగెంట్. మా ఇంట్లో తను సెట్ కాలేక పోయింది. ” చెప్పింది.

“దానికదృష్టం లేదే. ఏంచేస్తాం. దీనికైనా పిల్లలు పుట్టే యోగం ఉందో లేదో..కొంచం చూడమ్మా.” నిట్టూర్చింది గంగా భవాని. .

లోపలికి వెళ్దామని లేచాను.

“తను పెద్దగా చదువుకోలేదాంటీ, హెల్ప్ చెయ్యడానికి నేనూ వస్తాను. రోహూ, సిట్ విత్ గ్రాండ్ మా” అంటూ లేచిందిసుభద్ర.

నర్స్ వంక చూశాను.

"మీరు కూర్చోండి, మేమున్నాం కదా, మేము చూసుకుంటాం" అని మా కృష్ణ వేణి ఆపేసింది.

“వదినకు ఎడ్యుకేషన్ లేదాంటీ, మీరు ఇబ్బంది పడతారేమో.” అంటూ అక్కడే నిల్చుంది.

అప్పటికే నేను లోపలికెళ్ళిపోయాను.

“రోజూ వచ్చేవాళ్ళల్లో సగానికి సగం పెద్దగా చదువుకోని వాళ్ళేనండీ.” మా కృష్ణవేణి గొంతు వినిపిస్తోంది.

ఆ అమ్మాయి పేరు సీత.

కొన్ని గైనిక్ ప్రశ్నలడిగాను. బాగానే సమాధానాలు చెప్పింది.

“ పరీక్ష చేయించుకుంటావా? నీకిష్టమైతేనే చేస్తాను.”

“-----------.”

“ఏం పర్లేదు. తర్వాతెప్పుడైనా మీరిద్దరూ కలిసి రండి. అప్పుడు చేస్తాను ఎగ్జామినేషన్”

“ఇప్పుడే పరీక్ష చెయ్యండి మేడం.”

ఎగ్జామినేషన్ పూర్తి చేసి బయటికొచ్చేసరికి సుభద్ర డోర్ దగ్గరే నిల్చుంది.

“ఎలాఉందాంటీ ?” రిజల్ట్స్ వచ్చే రోజున సివిల్స్ లో టాపర్ కూడా ఇంత ఆత్రంగా ఉండడేమో.

మామూలుగా అయితే పేషంట్ వివరాలు పేషంట్ తోనే మాట్లాడాలి. ఎంత దగ్గర బంధువులైనా సరే పేషంట్ అనుమతి లేకుండా వివరాలేమీ చెప్పకూడదు.

కానీ తెలిసిన వాళ్ళ దగ్గర రూల్స్ పప్పులుడకవు .

“ఆమె ఆరోగ్యంగానే ఉంది. కాకపోతే మంచి ఆహారం తీసుకోవాలి.”

“ఇంట్లో అన్నీ వుంటాయాంటీ, తనే తినదు. అప్పటికీ లేవగానే ప్రోటీన్ షేక్ తీసుకుని , బ్రేక్ ఫాస్ట్ తీసుకోమని చెప్తూనే ఉంటాము. మమ్మీ డాడీ అయితే ఎంత బలవంతం చేస్తారో ఫుడ్ విషయంలో .... ఓవులేషన్ కు హెల్ప్ అవుతుందని స్ప్రౌట్స్, ఆల్మండ్స్ తిను వదినా అని చెప్తూనే ఉంటాను. “

“ప్రెగ్నన్సీ వస్తుంది గానీ, ఆ అమ్మాయిని తొందర పెట్టొద్దు.”

“అయ్యో మేమూ అదే చెప్తుంటాము. కాకపోతే తనే ఏడుస్తోంది ఇంకా రాలేదని. నేనెటూ తిరగలేనమ్మా. అమ్మాయీ, సీతా వస్తారు, ఇకనుండీ. నీ చేతిలో పెట్టాము. ఎలాగైనా వాళ్లకో పిల్లో పాపో కలిగేట్టు చూడు.”

గంగా భవాని నా చేతులు పట్టుకుని చెప్పింది.

అల్లుడు ఓ వారంలో వెళ్ళిపోతాడట కానీ సుభద్ర ఆరునెలలు ఇండియాలో ఉంటుందట. ఈ ట్రీట్మెంట్ విషయాలు అన్నీ తనే చూసుకుంటుందట.

“అలాగే, కానీ ఓ సారి మీ అబ్బాయిని కూడా పంపించండి.”

★★★★★★★★★

ఓ రోజున సీతా, ఆమె భర్తా వచ్చారు.

వాళ్ళ టెక్స్టైల్ బిజినెస్ చూసుకుంటాడట. కనీసం ముప్పైదేళ్ళుంటాయి. సీతకూ అతనికీ వయసులోనే కాదు, రూపం, మాట, తీరు, హోదా అన్నింటిలోనూ బాగా తేడా ఉంది. అతని పక్కన పనిపిల్లలా వినయంగా ఉంది తప్ప భార్యలా కూర్చోలేకపోతోంది.

అతను ఎక్కువగా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నాడు.

బిజినెస్ వత్తిడి ఎక్కువగా ఉంటోందనీ, దానికి తోడు పిల్లల టెన్షన్స్ ఎక్కువయ్యాయనీ అన్నాడు.

“మొన్న మీ పేరెంట్స్ వచ్చి వెళ్ళారు. పిల్లలు కావాలని అనుకుంటున్నారని.”

జస్ట్ అ మినిట్ అని లేచి పాంట్ జేబులో ఉన్న కారు తాళం సీతకిచ్చి, కార్లో ఫైల్ ఉంటుంది తీసుకురా అన్నాడు. ఆమె వెళ్ళింది.

“ఏం చెయ్యమంటారు మేడం ఎక్కడికెళ్ళినా ఇదే ప్రశ్న అడుగుతారు. ఇంకా విశేషమేం లేదా అని. తలెక్కడపెట్టుకోవాలో అర్థం కావడం లేదు. ఇంటికెవరొచ్చినా అదే ప్రశ్న. ఏరా పిల్లల్నికనే ఉద్దేశం లేదా అని. నలుగురు కలిసే చోటకెళ్ళాలంటే భయమేస్తోంది మేడం. స్నేహితులు కూడా చాల లోకువగా మాట్లాడుతున్నారు. చివరికి నాన్న కూడా ......." ఏదో చెప్పబోయి గొంతు సహకరించక ..కాసేపు ఆగి మళ్ళీ తమాయించుకుని .

“పిల్లలు లేకపోతే ఊళ్ళోవాళ్ళకే కాదు మేడం ఇంట్లో వాళ్ళక్కూడా లోకువే” అన్నాడు.

“---------.”

“ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తోంది మేడం.” అతని కళ్ళలో తడి.

సీత ఫైల్ తీసుకుని లోపలికి వచ్చేసరికి ఆమె చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు.

అతని ఫైల్స్ అన్నీ చూశాను. స్పెర్మ్ కౌంట్ మరీ అంత తక్కువగా ఏమీ లేదు.

“పెళ్ళయి సంవత్సరం కూడా కాలేదు. ఎవరో తొందరపెడుతున్నారని మీరు హడావుడి పడొద్దు. ఎందుకంటే ..”

"నాతో పెళ్ళైన వాళ్ళ వైఫ్ లందరూ ప్రెగ్నంట్ అయ్యారు. మాకే ---" కొంత సేపు ఆగి, "ఇప్పటికే లేటయ్యింది మేడం. ట్రీట్మెంట్ వెంటనే మొదలెట్టండి."

"మీ కౌంట్ స్పెర్మ్ కౌంట్, అదీ పర్లేదండీ. కాన్సంట్రేషన్ టెక్నిక్ ద్వారా మంచి కణాలను వేరు చేసి గర్భశయంలోకి ప్రవేశ పెట్టడం ద్వారా మీకు చాన్సెస్ బాగానే ఉంటాయి."

ఓ ఆరునెలలు ప్రయత్నించుదామనీ, సక్సెస్ కాకపోతే నెక్స్ట్ స్టెప్ కు వెళ్దామనీ చెప్పాను.

అంత సేపు మాట్లాడుతున్నా సరే, సీత పక్కనుందనీ, ఆమెక్కూడా ఈ సమస్యలో భాగం ఉందనీ అతను అనుకుంటున్నట్టే లేదు. ఆమెతో ఇంట్లో అయినా మాట్లాడతాడా అని అనుమానమొచ్చింది.

★★★★★★★★★★

ప్రతినెలా మంచి కణాలని వేరు చేసి ఆమెకు అండం విడుదల అయే రోజుల్లో గర్భాశయం లోపలికి ఎక్కించేవాళ్ళం. అయిదు నెలలు గడిచిపోయాయి. అంతకు ముందు నాలుగు సార్లు ఫెయిల్ అయింది.

ఓ రోజు ఉదయాన్నే నేను వాకింగ్ నుండి వచ్చేసరికి సుభద్రా, సీతా ఇద్దరూ రిసెప్షన్ లో కూర్చున్నారు.

"ఏంటి ఇంతపొద్దున్నే..... ఏమైంది?"

""జస్ట్ లైక్ దట్ ఆంటీ. ఇంత పొద్దున్నే మీరెక్కడికెళ్తారు?"

"వాకింగ్ కు వెళ్ళొస్తాను. అవునూ మీ పాప ఎలా ఉంది. తీసుకురాలేదా."

"రోహూ ఇజ్ గ్రోయింగ్ నాటీ డే బై డే. బాగా అల్లరి చేస్తోందని మమ్మీ దగ్గర ఉంచేసి వచ్చాము."

ముగ్గురికీ కాఫీ తెచ్చింది పనమ్మాయి.

"వదినా , నువ్వింక కాఫీ తాగడానికి వీల్లేదు" అంటూ చిలిపిగా సీత చేతుల్లోంచి కాఫీ కప్పు తీసుకుని పనమ్మాయికి ఇచ్చింది.

"అదేంటీ?" అడిగాను.

"ఆంటీ, మీకో గుడ్ న్యూస్, వదినకు డేట్స్ రాలేదు. ఆక్చువల్లీ , మొన్నే రావాలి. ఇంకా రాలేదు. టెన్షన్ ఆపుకోలేకపోతున్నాము. ఎర్లీ మోణింగ్ యూరిన్ శాంపుల్ టెస్ట్ చేయించుదామని, వచ్చాము." అంది సుభద్ర.

మా కృష్ణవేణి టెస్ట్ రిజల్ట్ తీసుకువచ్చి నా చేతికిచ్చింది.

'నెగటివ్' అని ఉంది.

సుభద్ర ఆ పేపర్ లోకి తొంగి చూసి "ఒఫ్ఫో ... బాడ్ లక్ ఎగైన్" అంటూ నుదిటి మీద చెయ్యి పెట్టుకుంది.

సీత వంక చూశాను. ఏ భావమూ లేదు. ఏమీ అనకుండా లేచి డ్రైవర్ ని పిలుస్తాను అంటూ వెళ్ళింది.

" ఎందుకు ఇంత హడావుడి సుభద్రా. పాపం సీత ఎంత బాధపడుతుందో ఆలోచించావా?"

"అయ్యో ఆంటీ, సీత కన్నా నేనే ఎక్కువ డిజప్పాయింట్ అవుతున్నాను. సచ్ అ బేడ్ డే." అంటూ వెళ్ళిపోయింది.

★★★★★★★

ఆ రోజు సాయంత్రం పూట సీత మావగారు వచ్చారు.

ఎప్పటిలాగే జోబులో చెయ్యి పెట్టుకుని లోపలికొచ్చారు

"రండి కూర్చోండి."

" ఇలా వాకింగ్ కు వచ్చాను. దార్లో హాస్పిటల్ తలిగితే ,ఓ సారి చూసిపోదామని లోపలికొచ్చాను ."

ఈ స్థలం ఎంతకు కొన్నారు. వాస్తూ అదీ చూపెట్టారా

ఓనర్స్ ఎవరో. ఇద్దరిపేరుమీదా ఉందా, డాక్టర్ గారి పేరుమీదేనా

పిల్లల్లో ఒక్కర్నీ డాక్టర్ చెయ్యలేదు. మరి మీ తర్వాత ఎట్లా

సరే కోడల్నైనా డాక్టర్ని తీసుకురండి

వచ్చిన విషయం ఏమిటో, అది తప్ప , తూ అన్ని విషయాలూ మాట్లాడుతున్నాడు.

మనమే లీడ్ ఇవ్వాలి.

"ఆంటీ బాగున్నారా?"

"మీ ఆంటీకేం బాగోలేదమ్మా, ఆరోగ్యం బాగా పాడైంది. సీతకు పిల్లల్లేరు. ఆ దిగులే దాన్ని తినేస్తోంది. తిండి తినదు, నిద్రపోదు, చిక్కి సగమైంది. ఈ పిల్లకేమో పిల్లలు పుట్టే యోగం లేకుండా పోయింది."

అంత బాధలోనూ కోడలి మీదే నెపం.

"ఆ అమ్మాయి ఏం చేస్తుందండీ. సమస్యేమిటో మీకు తెలుసుకదా !?

"అదినిజమేననుకో శైలజా. అసలింతకూ ప్రాబ్లెం ఏమిటమ్మా, ఎందుకు సక్సెస్ కావడం లేదు? "

'శైలజా?' నన్ను పేరు పెట్టి పిలిచేంత దగ్గర చుట్టం కాదే.

"మేము చేసే ప్రొసీజర్ లో, అండాన్నీ , స్పెర్మ్ నీ ఒక చోట పెడతాము. అవి కలిసేదీ లేనిదీ మాచేతిలో ఉండదు. మా కంట్రోల్ లో లేని ఫాక్టర్స్ ఎన్నో ఉంటాయి. అందుకని సమస్య ఏమిటో చెప్పడం కష్టం. "

"అవునూ, ఇలా మావాడిలా కౌంట్ తక్కువున్నవాళ్ళకు వేరే వాళ్ళ స్పెర్మ్ ఎక్కిస్తారట కదా"

పేషంట్ తరపు బంధువులతో కొన్ని విషయాలు చర్చించకూడదు. ఆ సంగతి గట్టిగా చెప్దామంటే, తెలిసినవాళ్ళయిపోయారు.

ఎటూ కాకుండా తలూపాను.

"అయితే నాదో చిన్న రిక్వెస్ట్ అమ్మా. " అంటూ జేబులోంచి ఓ రిపోర్ట్ తీసి నాటేబిల్ మీద పెట్టాడు.

"ఏమిటిది?" అంటూ తీసి చూశాను.

స్పెర్మ్ కౌంట్ రిపోర్ట్

"ఎలా ఉందో చూడమ్మా."

శుక్రకణాల సంఖ్య, కదలికలు చాలా బాగున్నాయి.

" ఇది ఎవరిది? మీ అబ్బాయిదా?"

అడిగినదానికి జవాబు చెప్పకుండా "ఎవడో రోడ్డున పోయేవాడిది ఎక్కించడం బదులు, మనలో మనమే సర్దుబాటు చేసుకుంటే సరి అని నేనూ, గంగా ఈ నిర్ణయానికొచ్చాం. ఏం చేస్తాం చెప్పమ్మా. ఏం చేసినా పిల్లలకోసమేకదా."

ఏదో అనుమానం.వళ్ళు జలదరించింది.

"ఎవరిదీ రిపోర్ట్? "

" దాని మీద పేరు రాసి ఉంది చూడమ్మా." అన్నాడు.

'నిరంజన రావు.'

"నాపేరే అది. రక్తంలో రక్తం. తప్పులేదు లేమ్మా. ఈ రోజుల్లో ఎన్నో జరుగుతున్నాయి. వాడికో బిడ్డపుడితే చాలని, నేనూ మీ ఆంటీ అనుకుంటున్నామమ్మా. అందుకనే ఈ తిప్పలన్నీ. ఈ సారి స్పెర్మ్ ఎక్కించేప్పుడు నా శాంపుల్ కూడా ఇస్తాను. రెండూ కలిపి ట్రై చెయ్యండి. నేను మళ్ళీ వస్తాను." అంటూ లేచాడాయన.

(ఈ కథ ముగింపు వచ్చే నెల )

★★★

Post your comments